
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
బుధవారం 13 ఆగస్టు 2025





జెండా వందనం చేస్తున్న మంత్రి మనోహర్

అమరుల త్యాగం అజరామరం

క్విట్ ఇండియా స్ఫూర్తితో సాగుదాం ● రణరంగచౌక్ సభలో మంత్రి మనోహర్

తెనాలి అర్బన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అమరవీరుల త్యాగం అజరామరమని వారి స్ఫూర్తితో ముందుకు నడుద్దామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో స్థానిక రణరంగచౌక్‌లో అమరవీరుల స్మారక స్థూపాల వద్ద సంస్మరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మనోహర్‌తో పాటు విద్యార్థులు, పట్టణ ప్రజలు, అధికారులు, ప్రజా ప్రతినిధులు రణరంగచౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా క్విట్ ఇండియా ఉద్యమంలో అమరులైన స్వాతంత్ర్య సమరయోధులకు పట్టణ ప్రజలు నివాళులర్పించారు. మంత్రి మనోహర్ భరతమాతకు పూలు సమర్పించిజాతీయ పతాకాన్ని ఎగురవేశారు. క్విట్ ఇండియా ఉద్యమంలో బ్రిటీష్ కాల్పులకు ప్రాణత్యాగం చేసిన అమరవీరులు మాజేటి సుబ్బారావు, సిరిగిరి లింగం, భాస్కరుని లక్ష్మీనారాయణ, తమ్మినేని సుబ్బారెడ్డి, (మిగతా 8వ పేజీలో)



ఎన్‌సీసీ క్యాడెట్లతో మంత్రి మనోహర్



క్లాత్ బ్యాగులను చిన్నారులకు అందజేస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై సమరం

గుంటూరు నుంచి యుద్ధం ప్రారంభం

ఇక్కడ విజయవంతమైతే 26 జిల్లాలకు విస్తరణ ● రెడ్‌క్రాస్ ప్రచార కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్‌నజీర్

గుంటూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పై సమరం సాగించాలని, ఈ ప్రాజెక్టు విజయవంతం అవడానికి పూర్తి మద్దతును అందిస్తామని గవర్నర్ అబ్దుల్ నజీర్ తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో 'ఆంధ్రప్రదేశ్ వాతావరణ కార్యచరణ, అమరావతి ప్లాస్టిక్ రహిత నగర ప్రచార కార్యక్రమాన్ని' మంగళవారం గవర్నర్ నజీర్ (మిగతా 8వ పేజీలో)



జేపీ సంస్థకు నోటీసులు

● 32 చోట్ల.. రూ.240 కోట్ల ఇసుక తవ్వకాలు ● జరిమానా.. కేసుల నమోదుకు సిద్ధమైన అధికారులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ఇసుక అక్రమాలపై గనులశాఖ చర్యలు చేపట్టింది. జేపీ సంస్థకు జిల్లాలోని 32 ప్రదేశాల్లో 12 లక్షల టన్నుల మైనింగ్‌తో రూ.240 కోట్ల విలువైన ఇసుక కొట్టేసినట్లు మైనింగ్ శాఖ నిర్ధారించి నోటీసులు జారీ చేసింది. అక్రమ మైనింగ్‌పై



నోటీసుల ద్వారా సంస్థ వివరణను మైనింగ్ శాఖ కోరింది. సరైన సమధానం ఇవ్వని పక్షంలో జేపీ సంస్థకు జరిమానాలు విధించడంతో పాటు కేసులు నమోదుకు జిల్లా శాండ్ కమిటీ సమాయత్తమవుతోంది. నదిలో దాదాపు 126 హెక్టార్లలో ఇసుక అక్రమాలు జరిగినట్లు నిర్ధారించింది. శాటిలైట్ ఛాయాచిత్రాల ద్వారా అక్రమాలను గుర్తించింది. జేపీ సంస్థ దాదాపు 12 లక్షల టన్నుల ఇసుకను అక్రమంగా తరలించుకుపోయినట్లు తేల్చింది. అధికారులు చర్యలకు ఉపక్రమిస్తుండటంతో అక్రమార్కులు కంగుతింటున్నారు. జేపీ సంస్థకు నోటీసులు జారీ చేసినట్లు జిల్లా మైనింగ్ అధికారి నాగాని తెలిపారు.

ఉపాధ్యాయుడిగా కలెక్టర్

● బోధన చేసి విద్యార్థుల పరిజ్ఞానం పరిశీలన
● బ్రాహ్మణపల్లి జడ్పీ హైస్కూల్ తనిఖీలో అరుణ్‌బాబు



విద్యార్థులకు పాఠాలు చెబుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పిడుగురాళ్ల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ అరుణ్‌బాబు ఉపాధ్యాయునిగా అవతారమెత్తాడు. విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించి.. విద్యార్థులతో చదివించి.. బోర్డుపై రాయించి.. వారి పరిజ్ఞానాన్ని స్వయంగా పరిశీలించారు. బ్రాహ్మణపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం కలెక్టర్ తనిఖీ చేశారు. పలు తరగతి గదుల్లో తిరుగుతూ, విద్యార్థుల పక్కన కూర్చొని విద్యాబోధనను పరిశీలించారు. విద్యార్థుల్లో ఉత్సాహం నింపేలా పలు ప్రశ్నలు అడిగి సమాధానం రాబట్టారు. కొంతమంది విద్యార్థులు తెలుగు పదాలు కూడా సక్రమంగా రాయలేని పరిస్థితిలో ఉండటాన్ని గమనించిన కలెక్టర్ ఉపాధ్యాయులకు పలు సూచనలు ఇచ్చారు. అంతకముందు జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు.

నాణ్యమైన భోజనంతో విద్యార్థులకు ఆరోగ్యం

పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని విద్యార్థులకు వడ్డించి ఆహారంలో నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన భోజనం ద్వారానే విద్యార్థులకు మంచి ఆరోగ్యం సమకూరుతుందన్నారు. చేతుల శుభ్రతపై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నోడల్ ఆఫీసర్ డాక్టర్ సతీష్, ఆర్డీవో మురళీకృష్ణ, డీఈవో చంద్రకళ, వైద్యాధికారి రవి, ప్రత్యేక అధికారి అంజనేయులు, తహసీల్దార్ మధుబాబు, ఇన్‌చార్జ్ ఎంపీడీవో దయాకర్, ఎంఈవో శ్రీనివాసరెడ్డి, కరాలపాడు వైద్యాధికారి ప్రవీణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



బ్రాహ్మణపల్లి జడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు



బాధిత విద్యార్థులకు నగదు సాయం చేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

అధైర్యం వద్దు.. అండగా ఉంటాం

● దాడికి గురైన విద్యార్థులకు ఎమ్మెల్యే పరామర్శ
● రూ.50 వేలు అందజేసిన యరపతినేని శ్రీనివాసరావు

దాచేపల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కుంగి పోవద్దు. ధైర్యంగా ఉండండి.. అండగా ఉంటా.. బాగా చదువుకుని ఉన్నత స్థానాలు అందుకోవాలి.. అని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు నారాయణపురంలోని బాలుర వసతి గృహ విద్యార్థులకు హామీ ఇచ్చారు. దాచేపల్లి పంచాయతీ నారాయణపురంలోని హాస్టల్‌ను మంగళవారం సందర్శించిన ఆయన ఇటీవల తోటి విద్యార్థుల దాడికి గురైన ఇద్దరు విద్యార్థుల్ని పరామర్శించారు. బాధిత విద్యార్థులకు తన వ్యక్తి గత నిధుల నుంచి చెరో రూ.25 వేలు చొప్పున అందజేశారు. హాస్టల్‌లో ఇలాంటి ఘటనలు జరగటం దురదృష్టకరమన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దాడిని కొందరు రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించు కోవడం దారుణంగా ఉందన్నారు. హాస్టల్ నిర్మాణానికి స్థలాన్ని సేకరించి నూతన భవనాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. సీసీ కెమేరాలను సొంత నిధులతో సమకూరుస్తానని హామీ ఇచ్చారు. భయపడి పిల్లల చదువును మధ్యలో ఆపి వేయవద్దని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. తన ఆర్థిక సహకారంతో ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థిని చూపి, అతడ్ని స్ఫూరిగా తీసుకోవాలని విద్యార్థులకు ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో నేతలు తంగెళ్ళ శ్రీను, నర్రా పుల్లయ్య, బద్రి, పగడాల భాస్కరరావు, అక్కినపల్లి బాలయ్య, సొసైటీ నారాయణ, ఐనాల శ్రీరాములు, కూరాకుల నాగేశ్వరరావు, మాడిశెట్టి పుల్లారావు, నెల్లూరి రామకోటయ్య, తోట వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న జేసీ గనోరే సూరజ్ ధనుంజయ్


విద్యార్థులను పరామర్శించిన జేసీ

దాడికి గురైన విద్యార్థులను జేసీ సూరజ్ ధనుంజయ్ మంగళవారం పరామర్శించారు. హాస్టల్‌లో జరుగుతున్న సంఘటనలను, విద్యార్థులపై దాడి చేసిన హాస్టల్ గదిని ఆయన పరిశీలించారు. విద్యార్థులు స్థానికంగా ఉన్న కళాశాలలో చదువులు కొనసాగించలేకపోతే మరో కళాశాలలో చేర్పిస్తామని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. దాడి చేసిన ఐదుగురు విద్యార్థులను హాస్టల్ నుంచి తొలగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఆర్డీవో మురళీకృష్ణ, తహసీల్దార్ శ్రీనివాస్, డీటీ బ్రహ్మయ్య, ఆర్ఐ శరత్‌కుమార్, వీఆర్‌వోలు రమేష్, యలమంద, బుడే పాల్గొన్నారు.

● అమలాపురంలో రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని అధికారులు పట్టుకున్నారు. దానిపై ఆరా తీస్తే మూలాలు ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉన్నట్లు వెల్లడైంది.

● మిర్యాలగూడ సమీపంలో తెలంగాణ వెళుతున్న వాహనాలను అధికారులు పట్టుకున్నారు. వాటి మూలాలు గుంటూరు జిల్లాలోనే తేలాయి.

మాఫియా.. మంత్రగాడు



(ఆంధ్రజ్యోతి గుంటూరు)

◆ రేషన్ బియ్యం రీసైక్లింగ్.. రవాణా అతడి కనుసన్నల్లో..
◆ మూడు జిల్లాల్లో అక్రమాలు
◆ రాష్ట్రంలో ఎక్కడ బియ్యం దొరికినా ఉమ్మడి గుంటూరులోనే మూలాలు

..ఇలా ఎక్కడ రేషన్ వాహనాలు దొరికినా వాటి మూలాలు గుంటూరులోనే తేలుతున్నాయి. అంతలా రేషన్ మాఫియా విస్తరించింది. రాష్ట్రంలో, దేశంలో ఏ మూల రేషన్ బియ్యం వాహనాలు దొరికినా కేరాఫ్ అడ్రస్ గుంటూరు అనేంతగా మాఫియా మంత్రగాడు చెలరేగిపోతున్నాడు. మాఫియా మంత్రగాడు ఉమ్మడి గుంటూరు జిల్లా మొత్తం మీద పట్టు సాధించాడు. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో సేకరించే బియ్యం మొత్తానికి ఏకైక దిక్కు సదరు మంత్రగాడే. కిలో రూ.21 కొనుగోలు చేసి, రీ సైక్లింగ్ చేసి రూ.26 నుంచి 30 వరకూ సొమ్ము చేసుకుంటున్నాడు. పేదల బియ్యం సరిహద్దులు దాటించే బాధ్యత వారిదే. వారి దయా దాక్షిణ్యాలుంటేనే మాఫియా శిబిరంలో మనుగడ ఉంటుంది. మాఫియా మొత్తాన్ని తన కనుసైగలతో శాశిస్తున్నాడు. అతడు దయతలిస్తేనే మాఫియా శిబిరంలో ఎవరైనా మనగలుగుతారు.. కాదంటే కనీసం అడ్రస్ కూడా లేకుండా పోతారు. అంత పకడ్బందీగా మాఫియా మంత్రగాడు వ్యవస్థను తన అదుపులో పెట్టుకున్నాడు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ప్రతి నెలా కొన్ని వందల టన్నులు పేదల బియ్యాన్ని రాష్ట్ర, దేశ సరిహద్దులు దాటి తరలిస్తున్నాడు.

డాన్ దయాదాక్షిణ్యాలతోనే మనుగడ

ఉమ్మడి గుంటూరు జిల్లాలో రేషన్ మాఫియా పటిష్ఠమైన చక్రబంధాన్ని ఏర్పాటు చేసుకుంది. రేషన్ మాఫియా, రైస్ మిల్లర్లు, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో ఏర్పాటైన ఈ సిండికేట్ అత్యంత పకడ్బందీగా వ్యవహారాన్ని నడిపిస్తోంది. క్షేత్రస్థాయిలో రేషన్ బియ్యాన్ని సేకరించడం మాఫియా డాన్ అతడి అనుచరగణం పని. ఆ బియ్యాన్ని రీ సైక్లింగ్ చేసి పక్క రాష్ట్రాలు, ఇతర దేశాలకు తరలించడం సదరు మంత్రగాడి పని. వాటిని (మిగతా 8వ పేజీలో)



శ్రావణమాసం మూడో మంగళవారాన్ని పురస్కరించుకుని పట్టణంలోని కనకదుర్గ ఆలయంలో అమ్మవారు నెమలి పింఛాల అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. - పిడుగురాళ్ల

19న మెగా కిసాన్ మేళా
● ఆధునిక వ్యవసాయంతో ఆర్థిక ప్రగతి
● ఉద్యాన పంటల వైపు రైతును ప్రోత్సహించాలి
● చీఫ్ పీప్ జీవీ ఆంజనేయులు
6

సాగర్‌కు భారీగా పెరిగిన వరద
● 18 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల
6
నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు
● ఆరోగ్య శాఖ కమిషనర్ వీర పాండ్యన్



సాగర్‌పై.. హర్ ఘర్ తిరంగా

విజయపురిసౌత్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మంగళవారం నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ భద్రతా దళాలు సాగర్ డ్యాంపై హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. సీఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ గిరీష్‌భట్ ఆధ్వర్యంలో భద్రతా బలగాలు జాతీయ జెండాలను చేతబూని భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ జరిపి మానవహారంగా ఏర్పడ్డారు. గిరీష్ భట్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన అమరులను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు.



పాసు పుస్తకాలు సిద్ధం

● రాజముద్రతో ఆధునికంగా ముద్రితం
● 15 నుంచి పంపిణీకి అధికారుల ఏర్పాట్లు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

జగన్ బొమ్మతో ఉన్న పట్టాదారు పాసు పుస్తకాల స్థానంలో రాజముద్రతో ఉన్న కొత్త పాసు పుస్తకాల పంపిణీకి రెవెన్యూ శాఖ ఏర్పాట్లు చేసింది. సరికొత్త పరిజ్ఞానంతో ముద్రించిన 97,207 పాసు పుస్తకాలు మండల కార్యాలయాలకు చేరాయి. గ్రామాల వారీగా ఈ నెల 15 నుంచి పంపిణీ చేపట్టి నెలాఖరుకి పూర్తి చేసేలా అధికారులు ప్రణాళికలను సిద్ధం చేశారు. వైసీపీ ప్రభుత్వంలో సర్వే చేపట్టి జగన్ బొమ్మతో ఉన్న పాసు పుస్తకాలను అందజేయడంపై రైతులు తీవ్రంగా వ్యతిరేకించారు. సదరు పాసు పుస్తకాలను మార్చాలని ఎన్నికల ముందు టీడీపీని రైతులు కోరారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం జగన్ బొమ్మ ఉన్న పుస్తకాల స్థానంలో కొత్త వాటిని ముద్రించారు. 22 మండలాల్లోని 102 గ్రామాల్లో తొలివిడత రీ సర్వే పూర్త కాగా ఆయా గ్రామాల్లో కొత్త పాసు పుస్తకాలను పంపిణీ చేయనున్నారు. క్యూఆర్ కోడ్‌తో పాటు ఆధార్ నెంబరు పుస్తకాలపై ఉంటాయి.

19న మెగా కిసాన్ మేళా

● ఆధునిక వ్యవసాయంతో ఆర్థిక ప్రగతి
● ఉద్యాన పంటల వైపు రైతును ప్రోత్సహించాలి
● చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



మెగా కిసాన్ మేళా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ

వినుకొండ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఆధునిక వ్యవసాయంతోనే రైతు ఆర్థిక ప్రగతి సాధ్యమని, ఉద్యాన పంటల సాగు దిశగా రైతుల్లో అవగాహన పెంపొందించి ప్రోత్సహించాలని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు కోరారు. మంగళవారం వినుకొండలో జరిగిన ఫెర్టిలైజర్స్ డీలర్లు, సహకారసంఘాల సీఈఓల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతు ఆర్థిక ప్రగతి ద్వారానే అభివృద్ధి సాధ్యమని తెలిపారు. వినుకొండ ప్రాంతంలో 1.30లక్షల ఎకరాలు సాగుభూమి ఉందని, దానిలో ఈ ఏడాది 14వేల ఎకరాల్లో పండ్లతోటల సాగుకు ప్రోత్సహించాలని కోరారు. ఉద్యానసాగు పంటలకు ప్రభుత్వం డ్రిప్ ఇరిగేషన్, రాయితీలు అందిస్తుందని రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతు ఆర్థికప్రగతికి బాటలు వేసేందుకు ఈనెల 19వ తేదీన వినుకొండ మార్కెట్‌యార్డులో మెగా కిసాన్ మేళా జరుగుతుందని, ఆధునిక వ్యవసాయం-ఆర్థికప్రగతి అనే అంశంపై రైతులకు అవగాహనసదస్సు జరుగుతుందని, రైతుల అవగాహన పెంపొందించేందుకు ఆచార్య ఎన్జీరంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ నుండి సైంటిస్టులు హాజరై సలహాలు సూచనలు ఇవ్వనున్నట్లు తెలిపారు. మెగా కిసాన్‌మేళాకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, పల్నాడు జిల్లా ఇన్చార్జి మంత్రి గొట్టిపాటి రవి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, జిల్లా కలెక్టర్, వ్యవసాయ, ఉద్యా నశాఖల తోపాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలి పారు. కావున నియోజకవర్గంలో రైతులు వేలాదిగా తరలివచ్చి లాభసాటి వ్యవసాయంపై శాస్త్రవేత్తలు చేసే సూచనలు, సలహాలు పాటించి పండ్ల తోటల సాగుపై రైతులు అవగాహన పెంపొందించుకోవాలని కోరారు. కిసాన్‌మేళ సభా ప్రాంగణస్థలాన్ని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవి ఆంజనేయులు పరిశీలించి ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని వ్యవసాయ, ఉద్యానశాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జీడీసీసీబి చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, ప్రజాప్రతినిధులు, ఫర్టిలైజర్స్ అసోసియేషన్ నాయకులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



స్త్రీ శక్తికి.. సిద్ధం చేస్తున్నారు..

ఉచిత బస్సు ప్రయాణీకుల కోసం పిడుగురాళ్ల డిపోలో బస్సులకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

పిడుగురాళ్ల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 15వ తేదీ నుండి మహిళలకు స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణాన్ని నిర్వహించనున్న నేపథ్యంలో పిడుగురాళ్ల ఆర్టీసీ డిపోలో వున్న బస్సులన్నీ ఉచితానికి సిద్ధం చేస్తున్నారు. అవసరమైన బస్సులకు సీట్లు, టైర్లు మార్చిడి, బస్సులోపల హ్యాండిల్స్, ఫుట్‌పాత్‌లు ఏర్పాటు చేశారు. ఇప్పటిదాకా కొన్ని బస్సులకు ఎక్కేమార్గం బస్సు ముందుభాగంలో వున్న వాటిని తొలగించి బస్సు మధ్యలో డోర్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఆర్‌టిసి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 15వ తేదీ శుక్రవారం నుండి పిడుగురాళ్ల డిపోలో వున్న 63 బస్సులను మహిళల కోసం ఉచిత బస్సులుగా మార్చేందుకు అధికారులు సన్నాహాలు పూర్తిచేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని ప్రారంభిస్తారని అధికారులు వివరించారు.

సాగర్ ప్రాజెక్టుకు భారీగా పెరిగిన వరద

● 18 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల



18 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

విజయపురిసౌత్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి 1,86,258 క్యూసెక్కుల వరదనీరు వస్తుండడంతో మంగళవారం ప్రాజెక్ట్ అధికారులు 18 క్రస్ట్‌గేట్లను తెరిచి దిగువకు నీటిని విడుదల చేశారు. ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,420 క్యూసెక్కులు, కుడికాలువ ద్వారా 7086 క్యూసెక్కులు, ఎడమకాల్వ ద్వారా 3788 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లోగా 1,86,258 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రాజెక్ట్ నీటిమట్టం 589.50 అడుగులుంది. ఇది 310.55 టీఎంసీలకు సమానం.

పులిచింతలకు 1,61,661 క్యూసెక్కులు

● 0.9969 ఎంయూల విద్యుదుత్పత్తి

రెంటచింతల,ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) :సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు నుంచి దిగువన వున్న పులిచింతలకు 1,61,661 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కె.వెంకటరమణ,ఈఈ సుబ్రహ్మణ్యంలు చెప్పారు.ప్రాజెక్టుకు చెందిన 12 రేడియల్ క్రస్ట్ గేట్లను 2.5 మీటర్ల మేర ఎత్తి 1,53,756 క్యూసెక్కులు, రెండు యూనిట్ల ద్వారా విద్యుత్ తయారైన తరువాత 7905 మొత్తంగా 1,61,661 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు.ఎగువన వున్న సాగర్ నుంచి 1,73,528 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు.రిజర్వాయర్‌లో 75.41 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 7.018 టీఎంసీ(థౌజెండ్ మిలియన్ క్యూసెక్కు)కు సమానం.

ప్రకాశం బ్యారేజికి..

● దిగువకు 71 వేల క్యూసెక్కులు



ప్రకాశం బ్యారేజి దిగువకు విడుదలవుతున్న వరదనీరు

తాడేపల్లి టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుండి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు ప్రధాన వాగుల నుండి 72 వేల 926 క్యూసెక్కుల వరదనీరు మంగళవారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్టు నీటిపారుదల శాఖ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా 30 గేట్లను 2 అడుగులు, 40 గేట్లను 2 అడుగుల మేర ఎత్తి దిగువకు 71 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అలాగే తూర్పు డెల్టా కాలువలకు 9 వేల 412 క్యూసెక్కులు పశ్చిమ డెల్టా కాలువలకు 6వేల 714 క్యూసెక్కులు, గుంటూరు ఛానల్‌కు 200 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు జేఈ తెలిపారు. వరద ఉధృతి పెరుగుతుండడంతో నది దిగువ ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలని, మత్స్యకారులు నది లోకి వెళ్లరాదని అధికారులు సూచించారు.

రౌడీలపై ఉక్కుపాదం మోపండి

● పౌరసరఫరాల శాఖ మంత్రి మనోహర్



మహిళా సిబ్బందితో మాట్లాడుతున్న మంత్రి మనోహర్, పక్కన సబ్ కలెక్టర్ సంజనా సింహ తదితరులు

తెనాలి, మారీసుపేట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రౌడీలు, చట్టవ్యతిరేక కార్యక్రమాలు చేసేవారిపై ఉక్కుపాదం మోపాలని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పోలీస్ అధికారులకు సూచించారు. మంగళవారం తెనాలి త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. నేర నియంత్రణకు సమన్వయంతో కృషిచేయాలని అధికారులకు సూచించారు. మహిళ పోలీసులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. సీఐ రమేష్‌బాబుకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట సబ్‌కలెక్టర్ సంజనాసింహ, డీఎస్పీ బీ జనార్ధనరావు ఉన్నారు.

నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు

● ఆరోగ్య శాఖ కమిషనర్ వీర పాండ్యన్ వెల్లడి
● మందడం జెడ్పీ హైస్కూల్‌లో మాత్రల పంపిణీ



విద్యార్థికి మాత్ర ఇస్తున్న కమిషనర్ వీరపాండ్యన్

గుంటూరు మెడికల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ప్రతి సంవత్సరం రెండుసార్లు బాలబాలికలు ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవడం ద్వారా నులిపురుగుల నుంచి పూర్తి రక్షణ లభిస్తుందని రాష్ట్ర వైద్యఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీర పాండ్యన్ తెలిపారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం(డీవార్మింగ్) పురస్కరించుకొని మంగళవారం గుంటూరు జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో, తుళ్లూరు మండలంలోని మందడం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలను ఆయన మింగించారు. కార్యక్రమంలో రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ అడిషనల్ కమిషనర్ డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరి, డీఎంహెచ్‌వో డాక్టర్ కే విజయలక్ష్మీ, డీఈవో రేణుక తదితరులు విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ వీరపాండ్యన్ మాట్లాడుతూ నులిపురుగుల వల్ల పిల్లల్లో రక్తహీనత, పోషకాహారలోపం, ఆకలి మందగింపు, కడుపు నొప్పి, వికారం, వాంతులు వంటి లక్షణాలు ఉంటాయన్నారు. ఆరు నెలలకు ఒకసారి ఆల్బెండజోల్ మాత్రలు మింగితే నులిపురుగులు దరిచేరవన్నారు. దీనివల్ల చదువులో చురుకుగ్గా ఉంటారని అన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మీ మాట్లాడుతూ డీవార్మింగ్ డే సందర్భంగా మం గళవారం జిల్లా అంతటా పాఠశాలలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మంగళవారం డీవార్మింగ్ పొందని పిల్లలకు ఆగస్టు 20వ తేదీన జరిగే మాపప్ కార్యక్రమంలో ఆల్బెండజోల్ మాత్రలు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఏ శ్రావణ్‌బాబు, ఆర్‌బీఎస్‌కే పథకం జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ రోహిణి రత్నశ్రీ, వైద్యాధికారి డాక్టర్ శివపార్వతి పాల్గొన్నారు.

వర్షపు నీటిని బయటకు తీసివేయాలి

● ఏరువాక శాస్త్రవేత్తల సూచన

గుంటూరు సిటీ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): వర్షాలకు నారుమడిలో, ఆరుతడి వరిసాగు పొలాలలో విత్తనం చల్లిన రెండునుంచి మూడురోజుల వయసులో ఎక్కువ నీటమునిగితే మొలకశాతం గణనీయంగా తగ్గుతుందని ఏరువాక కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం. వెంకటరాములు, కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.వెంకటలక్ష్మి తెలిపారు. వీలైనంత త్వరగా నీటిని బయటకు తీసివేయాలని వారు సూచించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు కారణంగా వరి నారుమడి, వరిపంట నీటమునిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలను మంగళవారం ప్రకటన విడుదల చేశారు. వరినారు నాటిన 7 నుంచి 30 రోజుల మధ్యలో ఐదు రోజుల కన్నా ఎక్కువగా నీటిలో మునిగితే నారు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. నీరు పూర్తిగా బయటకు తీసివేసిన తర్వాత 5 సెంట్ల నారు మడికి ఒక కిలో యూరియా, ఒక కిలో పొటాష్, ఒక గ్రాము కార్బెండిజం లేదా 2 గ్రాముల కార్బెండిజం మరియు మాంకోజెబ్ లను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

ట్రాక్టర్‌ను ఢీ కొట్టిన కారు.. వ్యక్తి మృతి

● మృతుడు పెసర్లంక వాసిగా గుర్తింపు



కర్ణుడు (ఫైల్)

తెనాలి, మారీసుపేట,ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్‌తో ఇసుక నింపుకొని అమ్మకాలు చేస్తూ జీవనం సాగిస్తున్న కార్మికుడు అదే ట్రాక్టర్ ట్రక్ కింద పడి మృతిచెందిన ఘటన తెనాలిలో కలకలం రేకెత్తించింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొల్లూరు మండలం పెసర్లంక గ్రామానికి చెందిన శౌంరి కర్ణుడు (53) ట్రాక్టర్ లో ఇసుక నింపుకొని భవన నిర్మాణదారులకు అమ్ముకుంటూ జీవనం సాగిస్తుంటాడు. ప్రతిరోజు పెసర్లంక నుండి తన ట్రాక్టర్‌లో ఇసుక లోడుతో తెనాలిలోని కబేళా వంతెన సమీపంలో నిలుపుదల చేసి అవసరమైన వారికి ఇసుక అన్‌లోడ్ చేస్తుంటాడు. ఇదే క్రమంలో మంగళవారం అదే ప్రాంతంలో ఇసుకతో ట్రాక్టర్‌ను నిలిపి ఉంచాడు. మధ్యాహ్నం సమయం కావడంతో ఎండ వేడిని తట్టుకోలేక ట్రాక్టర్ ట్రక్ కింద కూర్చున్నాడు. చందోలు తెనాలి ప్రధాన రహదారి కావడంతో అతి వేగంగా వచ్చిన కారు అదుపు తప్పి ట్రాక్టర్‌ను బలంగా ఢీ కొట్టింది. దీనితో ట్రాక్టర్ ట్రక్ క్రింద ఉన్న కర్ణుడుపై ట్రాక్టర్ ట్రక్ టైరు తలపైకెక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడుకి భార్య, పిల్లలు ఉన్నారు. అనుకోని ప్రమాదంలో భర్త మృతి చెందడంతో భార్య కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించడం స్థానికులను కలిచివేసింది. ప్రమాదానికి కారణమైన కారు నడిపిన యువకులు మద్యం సేవించి ఉన్నరని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంఘటనా స్థలానికి త్రీటౌన్ పోలీసులు చేరుకొని ఘటనకు సంబంధించిన వివరాలను విచారణ చేపట్టారు. మృతదేహన్ని పోస్టమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

వన్‌స్టాప్ సెంటర్‌తో.. మహిళలకు రక్షణ

గుంటూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): హింసకు గురైన మహిళల రక్షణ, సమాచార సేవలు అందించడంలో వన్ స్టాప్ సెంటర్ అత్యంత కీలకపాత్ర పోషిస్తుందని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రసూన అన్నారు. గుంటూరు నగరంపాలెంలోని సఖి వన్ స్టాప్ సెంటర్లో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మానసిక, సాంఘిక ఆదరణ కల్పించడం, అవసరమైన కౌన్సెలింగ్ అందించడం, వారికి న్యాయ సహాయం చేయడంతోపాటు సఖి వన్ స్టాప్ సెంటర్ ఆశ్రయం కూడా కల్పిస్తుందన్నారు. విమెన్ హెల్ప్ లైన్ 181ను నిర్వహించడంతోపాటు గృహహింస కేసులను పర్యవేక్షిస్తుందన్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న నేషనల్ హెల్త్ మిషన్, 108 సేవలు, పోలీసు శాఖతో అనుబంధంగా పనిచేయడం ద్వారా హింసకు గురైన మహిళలకు ఉన్న ప్రదేశంలోనే రక్షణ కల్పించడం, లేదా సమీపంలోని వైద్యశాలకు తరలించడం, హింసకు సరైన స్త్రీలకు వైద్య పరీక్షలు, చికిత్స నిమిత్తం సమీపంలోని వైద్యశాలకు తరలించి, నిపుణులైన కౌన్సెలర్‌తో మానసిక, సాంఘిక అంశాలలో కౌన్సెలింగ్ సదుపాయం కల్పిస్తామన్నారు. బాధిత మహిళలకు అవసరమైన మేరకు వన్‌స్టాప్ సెంటర్ ఆశ్రయం కల్పిస్తుందన్నారు. ఎక్కువ కాలం ఆశ్రయం అవసమైనప్పుడు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు నడిపే శక్తి సదన్‌లలో ఆశ్రయం కల్పిస్తామన్నారు. హింసకు గురైన మహిళతోపాటు ఆమె పిల్లలకు వయస్సుతో నిమిత్తం లేకుండా ఆడపిల్లలకు, 8 సంవత్సరములోపు మగపిల్లలకు కూడా 5 రోజులు వరకు ఆశ్రయం కల్పిస్తుందన్నారు. వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ కే. శాంతిభూషణ్ పాల్గొన్నారు.

51,686 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 53,783 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 51,686 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 9,821 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	9500	13400	334	9500	13500
నం.5	10000	13200	341	11000	14700
341	10000	14200	ఏసీ స్పెషల్‌వెరైటీ		
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			షార్క్-1	10000	14000
షార్క్-1	10000	14200	సీజెంటాబ్యాడిగ 5531	10000	12000
సీజెంటాబ్యాడిగ 5531	10000	13000	ఆర్మూరు	10200	12800
ఆర్మూరు	10000	13000	తాలుకాయలు	5000	7400

పల్నాడు వార్తలు

నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ కృషి

- ప్రభుత్వ కార్యాలయాలకు, వసతి గృహాలకు, పాఠశాలలకు ఆల్‌లైన్ వాటర్ సరఫరా
- కొండమోడు - పేరేచర్ల రహదారి అభివృద్ధికి కృషి
- ఎంపీ లావు చొరవతో అచ్చంపేట రోడ్డులో ఓవర్ బ్రిడ్జి

సత్తెనపల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సత్తెనపల్లి నియోజకవర్గ అభివృద్ధికి తనదైన కృషి చేస్తున్నారు. నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దే ప్రయత్నాలు చేస్తున్నారు. నిత్యం సత్తెనపల్లి కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ ఏ సమస్య వచ్చినా వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించి ప్రజలకు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు, అభిమానులకు భరోసా కల్పిస్తున్నారు. ఒక వైపు నియోజకవర్గ అభివృద్ధి, మరోవైపు కూటమి బలోపేతానికి కార్యాచరణతో ముందుకు వెళ్తున్నారు. మాజీ మంత్రి, సీనియర్ ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తనకున్న అనుభవంతో నియోజకవర్గ అభివృద్ధికి తగిన ప్రతిపాదనలు పంపటంతో పాటు సంబంధిత మంత్రులతో, ఉన్నతాధికారులతో, ముఖ్యమంత్రితో మాట్లాడి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు తెస్తున్నారు. సంవత్సర కాలంలో ఎంతో అభివృద్ధి చేశారు.

సొంత నిధులతో వాటర్ సరఫరా

తన తండ్రి కన్నా రంగయ్య ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా సత్తెనపల్లి పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాలు, పోలీసు స్టేషన్‌లు, వసతి గృహాలతో పాటు మండలంలోని వివిధ వసతి గృహాలకు ఆల్కలైన్ వాటర్ ప్రతిరోజు ఉచితంగా సరఫరా చేస్తున్నారు. మంచి నీటి ద్వారా ప్రజల ఆరోగ్య ప్రమాణాలను పెంచేందుకు కృషి చేస్తున్నారు.

ఎంపీ లావు చొరవతో పేరేచర్ల - కొండమోడు రహదారి

నియోజకవర్గ ప్రజలకు చిరకాల స్వప్నంగా ఉన్న రాజుపాలెం మండలం కొండమోడు, మేడికొండూరు మండలం పేరేచర్ల వరకు రహదారి నిర్మాణ పనులు ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు సహకారంతో ప్రారంభమయ్యేలా చేశారు. ఎన్నో సంవత్సరాలుగా ఈ రహదారి నిర్మాణం కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం తొమ్మిది వందల కోట్ల రూపాయల వ్యయంతో కొండమోడు నుంచి పేరేచర్ల వరకు నాలుగు లైన్‌ల రహదారి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే గుంటూరు సత్తెనపల్లి నుంచి హైదరాబాద్ వెళ్లే ప్రజలు త్వరగా గమ్యస్థానం చేరుకుంటారు. ఇదే విధంగా సత్తెనపల్లి నుంచి అచ్చంపేట వెళ్ళే రోడ్డు మార్గంలో రైల్వే ట్రాక్ వద్ద రైళ్ళు వచ్చే సమయంలో గేటు వేయటంతో ప్రయాణికులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్‌కు కూడా అంతరాయం కలుగుతుంది. సమస్య పరిష్కారం కోసం ఎంపీ లావు సహకారంతో రైల్వే గేటు వద్ద ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.70 కోట్ల నిధులు మంజూరు చేయించారు. సత్తెనపల్లి నుంచి నరసరావుపేట వెళ్లే రోడ్డును నాలుగు లైన్‌ల రహదారిగా విస్తరించేందుకు ఇప్పటికే సంబంధిత అధికారులతో, మంత్రులతో మాట్లాడారు. రూ.6.5 కోట్ల రూపాయల నిధులు కూడా మంజూరయ్యాయి. పట్టణంలో డ్రెయిన్‌ల అభివృద్ధికి రూ.22 కోట్ల ప్రతిపాదనలను సిద్ధం చేసి పురపాలకశాఖ మంత్రి నారాయణతో మాట్లాడారు. నిధులు మంజూరై డ్రెయిన్‌లు నిర్మిస్తే వర్షాకాలంలో మురికివాడల్లో నీరు నిలబడే సమస్య ఉండదు. పట్టణంలోని ఎన్‌ఎస్‌పీ కాలువ నుంచి నందిగామ అడ్డరోడ్డు వరకు రూ.40 కోట్ల వ్యయంతో రహదారి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ రహదారి చుట్టుపక్కల ప్రజలకు ఉపయోగంగా ఉంటుంది.

ప్రభుత్వాస్పత్రి అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ చొరవతో సత్తెనపల్లి ఏరియా వైద్యశాల 50 పడకల నుంచి వంద పడకలుగా మారింది. ఇటీవల ఆరోగ్య శాఖ మంత్రితో వైద్యశాల నూతన భవనాలను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ప్రారంభింప చేశారు. వైద్యశాలకు అవసర మైన పరికరాలను సమకూరుస్తున్నారు. బ్లడ్ బ్యాంక్ నిర్మాణం కూడా మంజూరు చేయించారు. ఏరియా వైద్యశాలలో ఉచితంగా రక్త పరీక్షలు, స్కానింగ్, ఫిజియో థెరపీ సేవలు వైద్యులు, సిబ్బంది ద్వారా అందేలా చూస్తున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులు ఇబ్బందులు పడకుండా అవసరమైన వైద్య సదుపాయాలు కల్పించాలని ఎప్పటికప్పుడు డాక్టర్లు, సిబ్బందికి ఆయన సూచిస్తున్నారు. పట్టణంలో నూతనంగా కోర్టు భవనాల ఏర్పాటుకు కూడా స్థలాన్ని కూడా మంజూరు చేయించారు. నూతనంగా నిర్మించిన ఆర్‌అండ్‌బీ అతిథి గృహం, సబ్ ట్రెజరీ కార్యాలయాలను మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డితో కలసి ఇటీవల ఆయన ప్రారంభింప చేశారు. రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న స్టేడియంను కూడా సంబంధిత మంత్రితో ఆయన ప్రారంభింప చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకు వచ్చారు.

సత్తెనపల్లిలో సుందరీకరణ పనులు

ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సత్తెనపల్లి పట్టణాన్ని అధికారులు సర్వ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. తాలూకా సెంటర్‌లో ఐ లవ్ యూ సత్తెనపల్లి బోర్డు ఏర్పాటు చేశారు. ఇది సత్తెనపల్లికి ఎంతో వన్నె తెచ్చింది. మున్సిపాలిటీ పరిధిలో నాలుగు కోట్ల రూపాయ లతో వంద పనులు చేయించారు. 312 మందికి సీఎం సహాయనిధి నిధులను రూ 3.50 కోట్ల వరకు అందించి పేద ప్రజల ఆరోగ్యానికి చేయూతనిస్తున్నారు. పార్టీలో పని చేసే వారికి పార్టీ పదవుల్లో ప్రాధాన్యం కల్పిస్తున్నారు.


ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలుతో కలసి అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ (పాతచిత్రం)


పట్టణంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డితో కలసి అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే కన్నా (పాతచిత్రం)


సుపరిపాలనలో తొలిఅడుగు భాగంగా బృగుబండలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ (పాతచిత్రం)


కస్తూర్బా విద్యాలయంలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ (పాతచిత్రం)



రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన ఎక్స్‌కవేటర్

సీజ్ చేసిన టిప్పర్

కలెక్టర్ చెబితే కానీ.. కనిపించలేదు

● త్రిపురాపురం కొండ వద్ద అక్రమ మైనింగ్
● పిడుగురాళ్ళ వెళ్తూ గమనించిన కలెక్టర్
● రెవెన్యూ అధికారులకు ఆదేశాలు
● ఎక్స్‌కవేటర్, టిప్పర్‌ను సీజ్ చేసిన రెవెన్యూ అధికారులు
● అధికారుల పాత్రపై కూడా అనుమానాలు

నకరికల్లు ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): నకరికల్లు మండలం త్రిపురాపురం కొండ వద్ద ఎన్నో నెలలుగా జరుగుతున్న అక్రమ మైనింగ్‌ను ఎట్టకేలకు రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు మంగళవారం పిడుగురాళ్ల వెళ్తూ త్రిపురారం కొండ వద్ద జరుగుతున్న అక్రమ మైనింగ్‌ను గమనించారు. వెంటనే అక్రమ మైనింగ్‌ను నిలిపివేయాలని తహసిల్దార్ పుల్లారావుకు అక్కడ నుంచే ఆదేశాలు జారీ చేశారు. దీంతో హుటాహుటిన తహసిల్దార్ పుల్లారావు ఆర్ఐ తోట సిద్ధయ్య, వీఆర్వో జెండా మౌలాలి మైనింగ్ ప్రాంతానికి వెళ్లి అక్కడ ఉన్న ఒక ఎక్సకవేటర్, టిప్పర్‌ను సీజ్ చేశారు. అక్రమ మైనింగ్ విషయాన్ని మైనింగ్ అధికారులకు సమాచారం ఇచ్చి కేసు నమోదు చేస్తున్నట్లు తహసీల్దార్ పుల్లారావు తెలిపారు. కలెక్టర్ ఆదేశాలిచ్చే వరకు స్థానిక రెవెన్యూ అధికారులు అక్రమ మైనింగ్ వ్యవహారం తెలియకుండా ఉందా అనే చర్చ విస్తృతంగా ఉంది. అందరు అధికారులకు తెలిసే తవ్వకాలు జరుగుతున్నాయి అనేది బహిరంగ రహస్యం. అయితే ఈ వ్యవహారంలో కలెక్టర్ తదుపరి చర్యలు ఏమి ఉంటాయో వేచి చూడాల్సిందే.

పౌరులు దేశభక్తితో అభివృద్ధిపథంలో సాగాలి

● బీజేపీ ఈస్ట్ ఇన్‌ఛార్జ్ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్



జాతీయ పతాకాలతో డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ తదితరులు

గుంటూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పౌరులంతా దేశభక్తితో దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని బీజేపీ ఈస్ట్ ఇన్‌ఛార్జ్ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ పిలుపునిచ్చారు. రాష్ట్ర పార్టీ సూచనల మేరకు హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా కొత్తపేట డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ కార్యాలయలో మంగళవారం 14వ మండల సమావేశం ఏర్పాటుచేశారు. డాక్టర్ ఉమాశంకర్ మాట్లాడుతూ 2047 నాటికి మన దేశం ప్రపంచదేశాలలోనే నెం.1 స్థానంలో నిలబెట్టటానికి ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. అనంతరం జాతీయ జండాలతో ర్యాలీగా నాజ్‌సెంటర్ చేరుకుని మాజీ ప్రధాని వాజపేయి, స్వాతంత్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సురేష్‌కుమార్‌జైన్, దేసు సత్యానారాయణ, నారాయణ రెడ్డి, మండల అధ్యక్షుడు మలిశెట్టి పవన్‌కుమార్, మండల పదాధికారులు దేవిశెట్టి బాబురావు, మైలవరపు ప్రవీణ్, జూలకంటి సుబ్రహ్మణ్యం, తల్లం మనోజ్, వేమూరి అనీల్ తదితరులున్నారు.

స్పెషల్ ట్రైన్ ప్రతిపాదించరా...!

● గురువారం నుంచి ఆదివారం వరకు ఇరువైపులా రైళ్లలో రిగ్రెట్‌లు
● ఎన్ఐ వర్కులతో రద్దు అయిన వాటిల్లో ఒక రైలు నడిపినా ఉపయోగమే
● మచిలీపట్నం/విజయవాడ - గుంటూరు - సికింద్రాబాద్‌కు డిమాండ్




గుంటూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఒకపక్క దుగ్గిరాల - తెనాలి - చుండూరు మధ్యన ప్రీఎన్ఐ, ఎన్ఐ, పోస్టు ఎన్ఐ వర్కుల కారణంగా పలు రైళ్ల రద్దు, కొన్ని దారి మళ్లింపు. మరోవైపు వారాంతం మూడు సెలవుదినాలతో హెవీ రష్. ఇప్పటికే గుంటూరు - సికింద్రాబాద్, గుంటూరు - బెంగళూరు మధ్యన రాకపోకలు సాగించే అన్ని రైళ్లలో ఇరువైపులా టిక్కెట్ బుకింగ్ చేసుకోవడానికి వీలు లేకుండా రిగ్రెట్‌లు. ఇంత డిమాండ్ ఉన్నప్పటికీ ఒక ప్రత్యేక రైలుని దక్షిణ మధ్య రైల్వే జోన్‌కు ప్రతిపాదించి ఆమోదం తీసుకోవడంలో డివిజనల్ రైల్వే అధికారులు మీనమేషాలు లెక్కిస్తోన్నారు. ప్రస్తుతం పలు రైళ్ల సర్వీసులు రద్దు కావడంతో అవి ఖాళీగా కోచ్ మెయిన్‌టెనెన్స్ డిపోల్లో ఉన్నాయి. వాటిల్లో ఒక దానిని మచిలీపట్నం/విజయవాడ నుంచి గుంటూరు మీదగా సికింద్రాబాద్, మరో రైలు బెంగళూరుకు నడిపితే ఇటు ప్రయాణీకులకు, అటు రైల్వేకు ఉపయోగకరంగా ఉంటుందని రైల్వే వినియోగదారుల సంఘాల నాయకులు సూచిస్తున్నారు.

ఈ నెల 15 స్వాతంత్ర్య దినోత్సవం, 16న కృష్ణాష్టమి, 17న ఆదివారం సెలవు దినాలు కావడంతో 14వ తేదీ మధ్యాహ్నం నుంచే ఇరువైపులా రైళ్లకు రద్దీ తలెత్తింది. ఇప్పటికే గుంటూరు మీదగా బెంగళూరు, సికింద్రాబాద్‌కు రాకపోకలు సాగించే అన్ని రైళ్లలో టిక్కెట్‌లు బుకింగ్ అయిపోయాయి. వెయిటింగ్ లిస్టులో కూడా బుకింగ్ చేయడానికి వీలు లేకుండా రిగ్రెట్ పడిపోయింది. మరోవైపు ప్రైవేటు బస్సు ఆపరేటర్లు ఇప్పటికే టిక్కెట్ ఛార్జీలను మూడు, నాలుగు రెట్లు పెంచేశారు. ఈ పరిస్థితుల్లో రైల్వే శాఖ ఒక ప్రత్యేక రైలుని ఈ మూడు రోజుల్లో ప్రకటిస్తుందానని ప్రయాణీకులు ఎదురు చూస్తున్నారు.


రేక్‌లకు కొదవ లేదు...

నిత్యం విజయవాడ - గూడూరు మధ్యన రాకపోకలు సాగించే విక్రమ సింహపురి ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ సర్వీసుని ఈ నెల 11 నుంచి 20వ తేదీ వరకు రద్దు చేశారు. ఈ కారణంగా సెకండ్ సిట్టింగ్, ఏసీ ఛైర్‌కార్ బోగీలతో ఉన్న పూర్తి స్థాయి రేక్ స్పెషల్ ట్రైన్ నడపడానికి అందుబాటులో ఉన్నది. అలానే డబుల్ డెక్కర్ రైలు కూడా ఖాళీగానే ఉన్నది. నరసపూర్ - ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలు రేక్ కూడా ఖాళీగానే ఉన్నది. ఈ నేపథ్యంలో స్పెషల్ నడపడానికి ఎలాంటి రేక్ కొరత లేదు. చేయాల్సిందల్లా గుంటూరు, విజయవాడ డివిజన్‌ల అధికారులు మాట్లాడుకొని ఒక స్పెషల్‌ని జోన్‌కు ప్రతిపాదించడమే.

యమ్మాజీగూడెంపై వివక్ష



యమ్మాజీగూడెం ఏరియల్ వ్యూ



యమ్మాజీగూడెంలోకి చేరిన కృష్ణానది నీరు

● సగం గ్రామస్థులకే పరిహారం
● పులిచింతల నీటి నిల్వతో కష్టాలు

బెల్లంకొండ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ముంపులోని యమ్మాజీగూడెంలో సగం గ్రామానికి, సగం ఇళ్లకు మాత్రమే నష్ట పరిహారం అందింది. మిగిలిన గ్రామస్థుల గురించి అటు అధికారులు, ఇటు పాలకులు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రాజెక్టులో నీరు నిల్వ చేసిన ప్రతిసారి గ్రామస్థులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ముంపు సమయంలో గ్రామస్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించడంతో అధికారులు సరిపెడుతున్నారు. శాశ్వత పరిష్కారం చూపించడంలో అధికారులు విఫల మవుతున్నారు. వన్ టైమ్ సెటిల్‌మెంట్ కింద నష్ట పరిహారం ఇవ్వాలని గ్రామస్థులు కోరుతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా తమను పట్టించుకున్న నాధుడే లేడని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం గ్రామంలో 126 గృహాల్లో ప్రజలు నివసిస్తున్నారు. వారంతా చీకట్లోనే మగ్గుతూ పొలాలు సాగు చేసుకుంటున్నారు. ప్రాజెక్టులో నీరు నిల్వ చేసిన సమయంలో గ్రామంలోకి నీరు ప్రవేశించి ఇళ్లల్లోకి విష సర్పాలు వస్తున్నాయని, పొలాలు మునిగి పోతున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. పీసీపీ నెంబర్లు ఇచ్చిన గృహాల యజమానులు సుమారుగా 30 నుంచి 40 మంది వరకు మృతి చెందారు. దీంతో తమ పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదని ఆయా కుటుంబాల వారు వాపోతున్నారు.

రేపు గుంటూరులో ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పర్యటన

● అధికారులతో సమీక్ష

గుంటూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ ఛైర్మన్, మేనేజింగ్ డైరక్టర్ పీ పుల్లారెడ్డి, టెక్నికల్ డైరక్టర్ ఆవుల మురళీకృష్ణయాదవ్‌లు ఈనెల 14న గుంటూరులో పర్యటించనున్నారు. ఈ మేరకు గుంటూరు జిల్లా అధికారులకు సమాచారం అందించారు. జిల్లాలో రెవెన్యూ బకాయిలతో పాటు వ్యవసాయ కనెక్షన్‌లు, స్మార్ట్ మీటర్లు ఏర్పాటు, ఆర్‌డిఎస్ఎస్ పథకం పనుల పురోగతి, పీఎం సూర్య ఘర్ పథకం వంటి వివిధ అంశాలపై సమీక్షించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ సందర్భంగా సీఎండీ క్షేత్ర స్థాయిలో డివిజనల్, సెక్షన్ కార్యాలయాలను కూడా సందర్శించనున్నట్లు సమాచారం. ఈ మేరకు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ చల్లా రమేష్ డివిజనల్ స్థాయి అధికారులకు తగు సమాచారంతో సీఎండీ సమీక్షా సమావేశాలకు రావాలని ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగంగా మంగళవారం పల్నాడు జిల్లా సర్కిల్ కార్యాలయంలో సీఎండీ పుల్లారెడ్డి, టెక్నికల్ డైరక్టర్ మురళీకృష్ణయాదవ్‌లు పర్యటించి సమీక్షా సమావేశం నిర్వహించారు. కాగా బుదవారం గుంటూరులో సీఎండీ పర్యటించాల్సి ఉండగా గురువారానికి వాయిదా పడింది.

ఏడు పదుల్లోనూ.. పరిమళిస్తున్న ప్రమీల

● చరిత్ర పరిశోధక రచయిత్రిగా వేమూరు వాసి



ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందనలు అందుకుంటున్న లక్ష్మీప్రమీల (ఫైల్)



మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు పేరంటాళ్లు పుస్తకాన్ని అందజేసి అభినందనలు అందుకుంటున్న లక్ష్మీప్రమీల

వేమూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఆమె వయస్సు ప్రస్తుతం 76 సంవత్సరాలు. సాధారణంగా ఎవరైనా అయితే కృష్ణా రామా.. అంటూ కాలం గడుపుతారు. కానీ వేమూరు గ్రామంలో రైతు కుటుంబంలో జన్మించిన కోగంటి లక్ష్మీ ప్రమీల చరిత్ర పరిశోధనా రచయిత్రిగా పరిమళిస్తోంది. ఇటీవల డాక్టర్ లక్ష్మీప్రమీల వేమూరు విజ్ఞాన సర్వస్వం గ్రంథాన్ని రచించారు. కథలు, కవితలు, నవలా రచనలతో రచయిత్రులు ఎక్కువగా ఉంటారు. చరిత్ర అన్వేషకులు, చరిత్రకారులు అరుదు. అయితే లక్ష్మీప్రమీల చరిత్రపై ఇష్టంతో లేటు వయసులో విద్య ప్రారంభించి వయస్సును లెక్క చేయకుండా క్షేత్ర పర్యటనల ద్వారా పరిశోధన ఫలితాలను పుస్తక రూపంలో అందించారు. 1949లో కోగంటి వెంకటరత్నమ్మ, వెంకటసుబ్బయ్యలకు జన్మించిన ఆమె వేమూరులోనే ఎస్ఎస్ఎల్‌సీ వరకు చదివారు. 1967లో రైల్వే ఉద్యోగి శివసత్యనారాయణతో ఆమెకు వివాహమైంది. భర్త ఉన్నత చదువుకు అంగీకరించలేదు. భర్త ఉద్యోగవిరమణ అనంతరం.. పిల్లలకు పెళ్లిళ్లు అయ్యాక ఆమె సిద్ధన మాధి యోగా శిక్షణ పొందారు. యోగా ఆమె జీవితాన్ని మలుపుతప్పింది. చదువు ఆపిన 36 ఏళ్లకు అనగా 55 సంవత్సరాల ప్రాయంలో భర్త అనుమతితో నాగార్జున యూనివర్సిటీలో బీఏ, ఎంఏ పూర్తి చేశారు. పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో ఎంఫిల్ చేసి పీహెచ్‌డీ పట్టా పొందారు. 56వ ఏటా భగవద్గీతలోని 108 శ్లోకాలు కంఠస్థం చేసి పారాయణాలు నిర్వహించారు. 55వ ఏట యోగా పోటీల్లో ఆరు సార్లు జాతీయ స్థాయి, రాష్ట్ర స్థాయిలో గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించారు. 2008లో విజయవాడలో జరిగిన 10కే రన్‌లో గోల్డ్‌మెడల్ పొందారు. భర్త, పిల్లల ప్రోత్సాహంతో ముందుకు వెళుతున్న ప్రమీల పొట్టి శ్రీరాములు విశ్వ విద్యాలయం ద్వారా చరిత్ర, సంస్కృతి, పురావస్తు శాస్త్ర పీఠం శ్రీశైలం ప్రాంతీయ, స్థానిక, స్థల, గ్రామ చరిత్రలపై అధ్యయనం ప్రారంభించారు. వేమూరు గ్రామ సాంఘిక పరిస్థితులు, రాజకీయ, మత, సాంస్కృతిక పరిస్థితులు పరిశీలన అనే అంశంపై పరిశోధించి 2012లో హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన స్నాతకోత్సవంలో ఉపకులపతి డాక్టర్ ఎల్లూరి శివారెడ్డి నుంచి ఎంఫిల్ పట్టా అందుకున్నారు. పేరంటాళ్ల - చారిత్రక అధ్యయనం అంశంపై పరిశోధన చేశారు. 69వ ఏట డాక్టరేట్ పొందిన ఆమె 2018లో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అధ్యక్షులు చింతపట్ల వెంకటాచారి నుంచి మల్టీ టాలెంటెడ్ ఉమెన్ బహుముఖ ప్రజ్ఞశాలిగా అవార్డులు, గోల్డ్‌మెడల్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ నుంచి లైఫ్ టైం ఎచీవ్‌మెంట్ అవార్డు అందుకున్నారు. పేరంటాళ్ల గ్రంథానికి ఉత్తమ పరిశోధక గ్రంథంగా గుర్తించి కల్చరల్ సెంటర్ ఆఫ్ విజయవాడ, అమరావతి పురస్కారాన్ని అందుకున్నారు. 2019లో సరస భారతి అధ్యక్షులు గబ్బిట దుర్గాప్రసాద్ నుంచి స్వయాసిద్ధ ఉగాది పురస్కారం అందుకున్నారు. 2023లో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సత్కరించి అభినందించారు. వేమూరులోని తమ తండ్రి సాగు భూమి ప్రాంతంలో కొన్ని చరిత్ర ఆనవాళ్ళు ఆధారంగా వేమూరు విజ్ఞాన సర్వస్వం గ్రంథాన్ని ప్రారంభించారు.

రైతన్నా.. జాగ్రత్త





● సాగు సమయంలో పాములతో అప్రమత్తం
● ప్రభుత్వ వైద్యశాలకు పెరుగుతున్న పాముకాటు కేసులు
● పూర్తి ఉచితంగా పాము కాటు విరుగుడు ఇంజక్షన్లు
● నాటు వైద్యాల జోలికి వెళితే ఇబ్బందులు తప్పవు

సత్తెనపల్లి, తెనాలి రూరల్ ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అసలే వర్షా కాలం, పంట పొలాల్లో పాముల సంచారం అధికంగా ఉండేకాలం. ఖరీఫ్ పనుల్లో నిమగ్నమైన అన్నదాతలు అప్రమత్తంగా ఉండాల్సిన సమయం. పంట పొలాలకు వెళ్ళే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ప్రతి సంవత్సరం ఈ సీజన్‌లో విష సర్పాల కాటుకు ఎంతో మంది రైతులు, రైతు కూలీలు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవటం శ్రేయస్కరం. పాము లేదా విష కీటకాలు ఏమైనా కాటు వేస్తే తక్షణమే ఆస్పత్రికి వెళ్ళి వైద్య సేవలు పొందాలి. నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాలకే ముప్పు. పాము కాటుకు గురైన వ్యక్తి ఒత్తిడికి గురి కాకుండా చూసుకోవాలి. తద్వారా ప్రమాదం నుంచి బయట పడవచ్చు.

పాములన్నీ విష పూరితం కాదు

పాములన్నీ విషపూరితం కాదు, 15శాతం పాములతోనే ప్రమాదం ఉంది. అదేవిధంగా 50 శాతం పాముకాటులు ప్రమాదం లేనివే. గాయమైతే చికిత్స చేసుకుంటే నయమవుతాయి. నాగుపాము, రక్తపింజర, కట్లపాము, కొండ చిలువ తదితర పాములు విషసర్పాలుగా చెప్పవచ్చు. జెర్రిపోతు వంటి పాములు కాటువేసినా ఏమాత్రం ప్రమాదం కాదు. కాని చికిత్స అవసరం.

అది ఏ మాత్రం పని చేయదు

పాము కాటుకు గురైన వారు ఎట్టి పరిస్థితుల్లోను టెన్షన్ పడకూడదు. ఆందోళన చెందితే గుండెపోటుకు గురయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రాథమిక చర్యగా కాటువేసిన భాగంలో కటు కట్టాలి. వెంటనే చికిత్స నిమిత్తం దగ్గలోని ఆస్పత్రికి వెళ్ళాలి. ఏ పాము కాటువేసిందో బాధితులు చెబితే దానికి తగిన చికిత్సను వైద్యులు అందిస్తారు. పాముకాటు వేసినచోట కొన్ని రకాల ఆకుపసర్లను పిండటం మంచిదికాదు. మరి కొందరు యంత్రాలను నమ్ముతారు. అవి ఏమాత్రం పనిచేయవు. అలాచేస్తే ప్రాణాలకే ముప్పు. పసరమందులు నమ్మి ప్రాణాల మీదకు తెచ్చుకోకూడదు.

ఈ జాగ్రత్తలు తీసుకోవాలి

ధాన్యపు గాదెలు, గడ్డి వాముల పరిసరాలు, తడిగా ఉన్న ప్రాంతాల్లో పశువుల పాకల్లో ఎండుకలప, పిడకలు తీసే క్రమంలో, సాగునీటి నిర్వహణ కోసం పంటపొలాల్లో పనుల నిమిత్తం వెళ్ళే సమయంలో జాగ్రత్తలు పాటించాలి. రాత్రి సమయాల్లో పంటపొలాలకు వెళ్ళాల్సివస్తే చేతికర్ర, టార్చ్‌లైట్ వినియోగించాలి. ఇంటి పరిసరాల్లో పిచ్చిమొక్కలు పెరగకుండా చూసుకోవాలి. పంటపొలాలకు వెళ్ళే దగ్గరలో ఉండే ఇళ్ళవద్ద పాములు సంచరించే అవకాశం ఉంది. ఈ వర్షాలకు పొలాల్లో పాములు సంచరిస్తాయి. రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

నాటుమందుల జోలికి వెళ్లవద్దు

పాముకాటుకు గురైన వారు గ్రామాల్లో అధికంగా ఉంటున్నారు. నాటువైద్యం పేరుతో పసరు కళ్లలో పోయించుకోవడం, మెడకు మాలలు వేయడం వంటివి చేసి చివరాఖరుకు వైద్యశాలలను సంప్రదించే వారు లేకపోలేదు. దీనివల్ల పాము విషం కాస్త శరీరంలోని అన్ని భాగాలకు చేరి వైద్యం కష్టతరంగా మారే ప్రమాదం ఉంది.


చికిత్స చేయించుకోవాలి

విష సర్పాలు, విష కీటకాలు కాటు వేసిన వెంటనే ఆస్పత్రిని ఆశ్రయించాలి. విధిగా విరుగుడు ఇంజక్షన్లు తీసుకోవాలి. ఇలా చేయటం ద్వారా సకాలంలో రోగులు కోలుకుంటా రు. ఏరియా వైద్యశాల లో మందులు అం దుబాటులో ఉ న్నాయి.

- డాక్టర్ లక్ష్మణరావు, ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్, సత్తెనపల్లి

అందుబాటులో వైద్యం

పాము కాటుకు గురైన వారికి అందుబాటులో వైద్య సేవలు ఉన్నాయి. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, ఏరియా వైద్య సేవల్లో యాంటీ స్నేక్ ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయి. సకాలంలో ఆస్పత్రులకు వెళ్ళటం వల్ల ప్రాణాపాయం నుంచి బయట పడవచ్చు. పాము కాటుకు గురైనవారు వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలి.



సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై సమరం

(5వ పేజీ తరువాయి)

ప్రారంభించి ప్రసంగించారు. భవిష్యత్తుతరాలకు పర్యావరణాన్ని రక్షించడానికి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలించడానికి ప్రజల్లో అవగాహన కల్పించడంలో యువత కీలక పాత్ర పోషించాలన్నారు. ప్లాస్టిక్‌ను నిర్మూలించడం పరిశుభ్రతకు సంబంధించిన విషయమే కాదని, బాధ్యతాయుతమైన సంస్కృతిని సృష్టించే అంశమన్నారు. పరిశుభ్రత, పచ్చదనంతో పర్యావరణహిత సింగిల్ యూజ్‌డ్ ప్లాస్టిక్ రహిత రాజధానిగా అమరావతిని తీర్చిదిద్దేందుకు రెడ్‌క్రాస్ సొసైటీ లక్ష్యంగా ఏర్పాటు చేసుకున్నట్లు చెప్పారు.

పైలెట్ ప్రాజెక్టుగా గుంటూరు..

యూత్, జూనియర్ రెడ్‌క్రాస్‌ల ఆధ్వర్యంలో దేశంలోనే మొట్టమొదటిసారి ప్లాస్టిక్ నివారణ ఉద్యమం గుంటూరులో ప్రారంభించడం సంతోషంగా ఉన్నదని తెలిపారు. రెడ్‌క్రాస్ రాష్ట్ర కోశాధికారి రామచంద్రరాజు నాయకత్వంలో పైలట్ ప్రాజెక్టుగా గుంటూరును ఎన్నుకున్నట్లు గవర్నర్ తెలిపారు. సాంస్కృతికంగా, విద్యాపరంగా ప్రత్యేకమైన స్థానం ఉన్న గుంటూరు నాయకత్వానికి ప్రసిద్ధి చెందినదని చెప్పారు. అందుకే ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సంస్థ సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై యద్ధాన్ని ఇక్కడి నుంచే ప్రారంభిస్తున్నదని చెప్పారు. ఇక్కడ విజయవంతమైతే కచ్చితంగా అది రాష్ట్రమంతటా విస్తరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గుంటూరు నగరంలో 50 వేల మంది జూనియర్ రెడ్ క్రాస్ విద్యార్థుల ద్వారా వారి కుటుంబ సభ్యులను ప్రేరేపించి, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నివారణకు రెడ్‌క్రాస్ కృషి చేస్తుందని తెలిపారు.

విద్యార్థులకు అభినందనలు..

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎస్తేరు రాణి, లౌఖ్యలను గవర్నర్ నజీర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఇద్దరు విద్యార్థినులు సోషల్ సర్వీసు కింద ప్రతీ మూడో శనివారం ప్రజల వద్దకు వెళ్లి సింగిల్ యూజ్ ప్లాసిక్ వల్ల కలిగే అనర్థాలు, ఏపీ వాతావరణ కార్యాచరణ గురించి వివరించి రెడ్‌క్రాస్ యాప్‌లో అప్‌లోడింగ్ చేస్తారు. వీరు చేస్తోన్న సర్వీసుని గవర్నర్ ప్రశంసించారు. తొలుత రెడ్ క్రాస్ వ్యవస్థాపకుడు హెన్నీడ్యునాంట్ చిత్రపటానికి గవర్నర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏకే ఫరీదా, గవర్నర్ ఎక్స్ ఆఫిషియో సెక్రటరి డాక్టర్ ఎం హరిజవహర్‌లాల్, రెడ్ క్రాస్ ఏపీ రాష్ట్ర శాఖ ఛైర్మన్ వైడీ రామారావు, కోశాధికారి పీ రామచంద్రరాజు, గుంటూరు జిల్లా బ్రాంచ్ ఛైర్మన్ వడ్లమాని రవి తదితరులు పాల్గొన్నారు. గవర్నర్‌కు కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్, ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, మహమ్మద్ నసీర్ అహ్మద్, గళ్లా మాధవి, నగరపాలక సంస్థ కమిషనరు పులి శ్రీనివాసులు పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు.

అమరుల త్యాగం అజరామరం

(5వ పేజీ తరువాయి)

గాలి రామకోటయ్య, ప్రయాగ రాఘవయ్య, జాస్తి అప్పయ్యల స్థూపాల వద్ద పూలు సమర్పించి నివాళులర్పించారు. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ క్యాడెట్ల గౌరవ వందనం చేయించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ, స్వాతంత్ర్య పోరాటంలో తెనాలిలో జరిగిన సంఘటన దేశం మొత్తం ఉలికిపాటుకు గురి చేసిందని, ప్రతి ఒక్కరిలో స్ఫూర్తి రగిలించిందన్నారు. సమరయోధులు మనపై పెట్టిన గురుతర బాధ్యతను నెరవేర్చాలన్నారు. కోట్లాది మంది పోరాటం, పోరాట పటిమ, త్యాగ నిరతితో దేశానికి సిద్ధించిన స్వాతంత్ర్యాన్ని కుల, మతబేధాలు విడిచి కాపాడుకోవాలన్నారు. మహిళా కమిషన్ మాజీ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ కులమతాల అడ్డుగోడలు నిర్మించుకుని ఎందరో త్యాగాలతో వచ్చిన స్వాతంత్ర్యానికి విలువ లేకుండా చేయవద్దని కోరారు. సమాజసేవ చేస్తున్న పలువురు పట్టణ ప్రముఖులను ఘనంగా సన్మానించారు. సబ్ కలెక్టర్ సంజన సింహా, మున్సిపల్ ఛైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ లక్ష్మీపతిరావు, తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, డీఎస్పీ జనార్ధనరావు, లెఫ్టినెంట్ కల్నల్ ఉదయ్‌కుమార్, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

మాఫియా మంత్రగాడు..

(5వ పేజీ తరువాయి)

చూసీచూడనట్లు వదిలేయడం అధికార యంత్రాంగం పని. ఏదైనా సమస్యవస్తే వాటిని పరిష్కరించడం ప్రజాప్రతినిధుల పని. పాతగుంటూరు, ప్రత్తిపాడు, సత్తెనపల్లిలో మిల్లులు నడుపుతున్న ఓ మిల్లర్, గుంటూరు ఆర్టీసీ కాలనీలోని మరో మిల్లర్ ఈ వ్యవహారం మొత్తంలో అత్యంత కీలకంగా ఉన్నాడు.

ఆధిపత్య పోరులోనూ చక్రం..

ఇటీవల రేషన్ మాఫియాలో ఆధిపత్య పోరు నెలకొంది. ఎప్పటి నుంచో మాఫియాపై పట్టున్న డాన్‌పై కొంతమంది తిరుగుబాటు చేసి సొంత ముఠా పెట్టుకున్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం కేంద్రంగా బియ్యాన్ని సేకరించారు. దీంతో మంత్రగాడు ఆ ముఠాపై కన్నెర్ర చేశాడు. ఐదారు నెలలుగా బియ్యాన్ని సేకరించిన కొత్త ముఠా బియ్యాన్ని సొమ్ము చేసేవారు లేక అల్లాడిపోయారు. చివరకు వారే తరలించేందుకు సిద్ధమవగా అధికారులకు, పోలీసులకు సమాచారం ఇచ్చి వారిని పట్టించారు. ఇలా గడిచిన ఐదారు నెలల్లో కొత్తగా పుట్టుకొచ్చిన మరో మాఫియా డాన్ నేత రూ.70 లక్షల మేర నష్టపోయి చేతులెత్తేశాడు. తాజాగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో మరొకరు ముందుకొచ్చారు. ఈ వారంలోనే అతడి వాహనాలు అధికారుల చేతిలో పడ్డాయి. దీంతో అతడి పని కూడా అయిపోయింది. ఇలా ఈ మాఫియా డాన్ తిరుగులేని ఆధిపత్యాన్ని చెలాయిస్తున్నాడు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

ప్రభుత్వ వైద్యశాలలో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ



రోగిని పరీక్షిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

నరసరావుపేట లీగల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మంగళవారం స్థానిక ప్రభుత్వ జిల్లా వైద్యశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు. వారికి అందుతున్న వైద్య సదుపాయాల గురించి విచారించారు. రోగులకు సరైన వైద్యసేవలు అందుతున్నాయా లేదా అని ఆయన ఆసుపత్రి సిబ్బందితో చర్చించి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో హాస్పటల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ లక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, హాస్పటల్ సూపరింటెండెంట్ సురేష్, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆరేపల్లి అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీల బహూకరణ

రొంపిచర్ల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరేపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీలను మంగళవారం బహూకరించారు. గ్రామానికి చెందిన శివ, హరిప్రియలు రూ.4,400 విలువచేసే కుర్చీలను అందజేశారు. ఈ సందర్భంగా వారిని అంగన్ వాడీ కేంద్రం నిర్వాహకులు, గ్రామస్థులు అభినందించారు.

ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ గ్రంథపాలకుల దినోత్సవం

నరసరావుపేట టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ పితామహుడు డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ 133వ జయంతి సందర్భంగా జాతీయ గ్రంథపాలకుల దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ షేక్ కరీమ్‌మొహిద్దీన్, ఎండీ షేక్ మస్తాన్ షరీఫ్ మాట్లాడుతూ సున్నితమైన పుస్తకాలను, ఇతర పత్రాల డిజిటల్ ఆర్కైవింగ్ పురోగతిలో ఉందన్నారు. 1900కు ముందు ప్రచురితమైన ఆంగ్ల పుస్తకాలు, డాక్యుమెంట్లు, 1920కు ముందు భారతీయ ప్రచురణలు డిజిటలైజేషన్‌కు సిద్ధంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కళాశాల గ్రంధపాలకులు పీ సునీల్ ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

చిలకలూరిపేట మార్కెట్ కమిటీ కార్యవర్గ సభ్యుల నియామకం

చిలకలూరిపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మార్కెట్ కమిటీ కొత్త కార్యవర్గ సభ్యుల నియామకపు జీవోను రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం విడుదల చేసింది. ఏడాదిపాటు కొత్త కమిటీ సభ్యులు పదవులలో కొనసాగుతారు. మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా పట్టణానికి చెందిన షేక్ కరిముల్లా వైస్ చైర్మన్ గా పిల్లి కోటేశ్వరరావు నియమితులయ్యారు. కమిటీ సభ్యులుగా జే.రవి, పి.హనుమంతరావు, ఎ.లీలాకిషోర్, సి.పద్మ, ఎస్.శాంతిప్రియ, జి.అంజలి, పి.సుమలత, అనంతవీరకుమారి, కె.మల్లేశ్వరి, ఎం.దుర్గాభవాని, ఎం.వెంకటనారాయణ, కె.శ్రీనివాసరావు, అబ్దుల్‌నబి నియమితులయ్యారు. కమిటీ గౌరవాధ్యక్షుడిగా ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు వ్యవహరిస్తారు.

క్లుప్తంగా...

● వినుకొండ టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 17వ తేదీన పట్టణంలో జరిగే పల్నాడు జిల్లా గిరిజన ప్రజాచైతన్య యాత్రను విజయవంతం చేయాలని జీవీఎస్ జాతీయ అధ్యక్షుడు, మాజీ రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడితే శంకర్‌నాయక్ మంగళవారం తెలిపారు. వినుకొండలో ప్రజాచైతన్యయాత్రపై సమావేశం నిర్వహించి అనంతరం చైతన్యయాత్ర వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

● రొంపిచర్ల: ఓబీసీ రిజర్వేషన్‌లకు పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టి ఆమోదించి చట్టబద్ధత కల్పించటంపై స్థానిక చెరువు కట్ట సెంటర్‌లో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ప్రధాని నరేంద్రమోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు సరికొండ తిమ్మరాజు, పిడెం హుస్సేన్, కంభంపాటి వెంకయ్య, వీరయ్య, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● ఈపూరు: శాఖా గ్రంథాలయంలో మంగళవారం గ్రంథాలయ దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఆర్.రంగనాథ్ 133వ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

● బొల్లాపల్లి: మండలంలో అక్షరాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో పీ సీతారామయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అక్షరాంధ్ర ఉల్లాసంపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ బత్తి రాములు, వయోజన విద్య సూపర్‌వైజర్ ఎస్‌కే వెంకటేశ్వర్లు, ఏపీఎం లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

● బొల్లాపల్లి: మండలంలోని రావులాపురం, రేమిడిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఏపీ మోడల్ స్కూళ్ళు పల్నాడు జిల్లా సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు పాఠశాలను సందర్శించి బడి బయట ఉన్న పిల్లలను తిరిగి పాఠశాలలో చేర్పించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో సెక్టోరియా అధికారులు ఏపీవో పద్మారావు, ఏఎస్‌వో శంకరరాజు, ఎంఎల్‌సీ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఎంఈవో పార్వతి, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: మండలంలోని తాతపూడి, బొప్పూడి గ్రామాలలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయశాఖ అధికారి సీహెచ్ సరిత మాట్లాడుతూ రైతులందరూ కూడా తమ పొలంలో వేసుకున్న ప్రతి పంటను నమోదు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ప్రవీణ్, బొప్పూడి, తాతపూడి రైతు సేవా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పెరుమాళ్లపల్లి మేజర్.. ఉధృతం





కాలువ పొర్లి కట్టలపై వృథాగా పోతున్న సాగర్‌నీరు, తూముల వద్ద నిలిచిఉన్న వ్యర్థాలు

● విష్ణుకుండినగర్‌లోకి ప్రవహిస్తున్న నీరు

● పట్టించుకోని ఎన్ఎస్‌పీ, మున్సిపల్ అధికారులు

వినుకొండ టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సాగర్ కాల్వ నుంచి నీరు విడుదలతో పెరుమాళ్లపల్లి మేజర్ ఉధృతంగా ప్రవహిస్తోంది. వినుకొండలోని గాయత్రీనగర్ వెళ్లే చప్టా తూములు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండి నీరు ముందుకు ప్రవహించే పరిస్థితి లేదు. దీంతో కాల్వలోని నీరు పొర్లి విష్ణుకుండినగర్‌లోని అమ్మవారి దేవాలయం వద్దకు చేరుకున్నాయి. అదేవిధంగా కనకదుర్గమ్మ దేవాలయ ఆవరణ సాగర్ నీటితో నిండిపోయింది. ముంచెత్తుతున్న నీటిపై ఆ ప్రాంతవాసులు ఎన్ఎస్‌పీ, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తూముల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చూడాలని ప్రజలు వాపోతున్నారు. స్థానికులు సమస్యను తమ దృష్టికి తెచ్చారని, నీటి ప్రవాహం తగ్గిన వెంటనే తూముల్లోని వ్యర్థాలను తొలగిస్తామని మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ తెలిపారు.

పేదలకు ఆసరాగా నిలుస్తున్న సీఎం సహాయనిధి

● చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు



చెక్కులు పంపిణీ చేస్తున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో వేలాదిమంది పేద కుటుంబాలకు సీఎం సహాయనిధి అండగా నిలుస్తోందని చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. మంగళవారం పట్టణంలోని చీఫ్‌విప్ కార్యాలయంలో బాధితులకు సీఎం సహాయ నిధి చెక్కులు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ గతంలో మరే ప్రభుత్వం ఇవ్వనంత స్థాయిలో సీఎం చంద్రబాబు నాయుడు సీఎంఆర్ఎఫ్ ద్వారా నిధులు కేటాయించి బాధిత పేద కుటుంబాలను ఆదుకుంటున్నారని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో 450 కోట్లు సీఎంఆర్ఎఫ్‌కి ఖర్చు చేస్తే, 14 నెలల కూటమి పాలనలో రాష్ట్రవ్యాప్తంగా అనారోగ్య బారిన పడిన వేలాది మంది బడుగు బలహీనవర్గాల పేదలకు రూ.500కోట్లు సాయంగా అందించినట్లు తెలిపారు. వినుకొండ నియోజకవర్గంలో 733మంది బాధితులకు 5కోట్ల 18లక్షలు ఇవ్వటం జరిగిందన్నారు. మంగళవారం 89మంది బాధిత కుటుంబాలకు 63లక్షల 19వేలు సీఎం సహాయ నిధి చెక్కులు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు నాగ శ్రీనురాయల్ కౌన్సిలర్లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

దౌర్జన్యం చేస్తున్న వ్యాపారిపై ఫిర్యాదు

వినుకొండ టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 6వార్డులోని పద్మజ హాస్పిటల్ పక్కన ఉన్న గేటెడ్ కమ్యూనిటీ వాసులపై ఓ వ్యాపారి దౌర్జన్యం చేస్తున్నాడంటూ కాలనీవాసులు ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుకు ఫిర్యాదు చేశారు. గత 34సంవత్సరాల క్రితం ఏర్పాటుచేసిన గేటెడ్ కమ్యూనిటీలో గృహాలు నిర్మించుకొని 40కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, ఈ వెంచర్‌తో సంబంధం లేనటువంటి ప్రముఖ వ్యాపారి సముద్రాల వెంకన్న ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మాణం కోసం గేటెడ్ కమ్యూనిటీ కాంపౌండ్ వాల్‌ను కూల్చి దౌర్జన్యం చేస్తున్నట్లు అక్కడి కుటుంబాలు ఫిర్యాదుచేశారు. దీనిపై చర్యలు తీసుకోవాలని జీవీ ఆంజనేయులు మున్సిపల్ కమిషనర్‌ని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ రోడ్ ఎక్స్‌టెన్షన్‌కు సంబంధించి ఎటువంటి అనుమతులు గాని, తీర్మానం గాని లేదన్నారు. దీనిపై తగు చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

కార్యక్రమంలో బెజవాడ వెంకట నాగేశ్వరరావు, వెంకటేశ్వరరెడ్డి, జె.ఆంజనేయులు, కె.శ్రీనివాసరావు, ఎస్.కే హమీద్, సీహెచ్ మణికంత, ఫణికుమార్, జి.ప్రసాద్, కె.ప్రసాద్, ఎం.సుబ్బారావు, కే రామారావు, బి.ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 274 మందికి ఉద్యోగాలు



జాబ్ మేళాలో నియామక పత్రాలు అందచేస్తున్న ఎమ్మెల్యే పుల్లారావు, నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి తమ్మాజీరావు తదితరులు

చిలకలూరిపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలం మద్దిరాలలోని సాదినేని చౌదరయ్య డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన జాబ్ మేళాలో 274 మందికి ఉద్యోగాలు లభించాయి. ఈ మేరకు ఎంపికైన వారికి నియామక పత్రాలను ఆయా కంపెనీల వారు అందచేశారు. మొత్తం 582మంది నిరుద్యోగులు జాబ్ మేళాకు హాజరయ్యారు. 22కంపెనీల వారు ఉద్యోగాల కోసం వచ్చిన అభ్యర్థులను ఇంటర్వ్యూలు చేశారు. జాబ్ మేళాను స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన ఆయా సంస్థల వారు వారు గ్రామీణ ప్రాంత అభ్యర్థులకు ఉద్యోగాలకు ఎంపికలో ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. యువత కూడా కాలానుగుణంగా తమ ప్రతిభా పాటవాలు మెరుగుపరచుకోవాలని సూచించారు. గ్రామీణ యువత నైపుణ్యాలు పెంచుకొని లక్ష్యసాధన దిశగా ముందుకు సాగాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రోత్సహిస్తున్న ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్, క్వాంటమ్ కంప్యూటింగ్, ఇతర సాంకేతికతపై యువత దృష్టి పెట్టాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యా అభివృద్ధి అధికారి ఈ తమ్మాజీరావు, కళాశాల చైర్మన్ సాదినేని హనుమంతరావు, డైరెక్టర్ శివప్రసాద్, ఎంఈవో నరసింహారావు, ఏడీ ఎస్‌డీవో రామాంజనేయులు, డీపీవో రవీంద్ర నాయక్, కో ఆర్డినేటర్ సురేష్ పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ



యడ్లపాడులో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ భరద్వాజ

యడ్లపాడు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, అంగన్‌వాడీ కేంద్రాలలోని విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. యడ్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ భరద్వాజ, ఈవోపీఆర్డీ షేక్ జాకీర్‌హుస్సేన్‌లు పాల్గొని విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు. మండలంలోని అన్ని అంగన్‌వాడీ, ప్రభుత్వ, పాఠశాలలు, హాస్టల్స్‌లో 8,313 మంది విద్యార్థులు ఉండగా మంగళవారం 93శాతం 7,718మందికి నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేసినట్లు వైద్యాధికారి వెల్లడించారు. మిగిలిన పిల్లలకు ఈ నెల 20వ తేదీన పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శశికళ, హెచ్ఎం విజయభారతి, సీహెచ్‌వో పున్నారావు, హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

● శావల్యాపురం: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని 15గ్రామ పంచాయతీల్లో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగనవాడీ కేంద్రాల్లో మొత్తం 4919మంది పిల్లలు ఉండగా 4701మందికి మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలు అందించామన్నారు. మరో 819మందితో ఈ నెల 20న మాత్రలు మింగిస్తామని వైద్యాధికారిణి రావిపూడి రమ్య తెలిపారు. శావల్యాపురం జడ్పీపాఠశాల్లో వైద్యాధికారిణి రమ్య, హెచ్ఎం విజయలక్ష్మి పాల్గొని విద్యార్థులతో మాత్రలు మింగించారు. జిల్లా అడిషనల్ డీఎంహెచ్‌వో, ప్రోగ్రామింగ్ ఆఫీసర్ మురళీకృష్ణ ఉదయాన్నే స్థానిక పీహెచ్‌సీని సందర్శించి మాత్రల పంపిణీ వివరాలు సిబ్బందితో తెలుసుకొని తగిన సూచనలిచ్చారు. సూపర్‌వైజర్‌లు ఏడుకొండలు, ఉమాదేవి, స్టాఫ్‌నర్స్ ప్రమీల, ల్యాబ్ టెక్నీషియన్ సతీష్, ఫార్మసిస్ట్ లక్ష్మీనారాయణ, ఏఎన్ఎం శ్రీలత, అంగనవాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

● రొంపిచర్ల: మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా ఆల్ బెండా జోల్ మాత్రలను మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు జగన్ నరసింహారెడ్డి, సాయి బాబు, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● ఈపూరు: నులిపురుగుల నివారణ దినోత్సవంను పురస్కరించుకొని మండలంలోని కొచ్చర్ల పీహెచ్‌సీ పరిధిలో 3010 పిల్లలను గుర్తించారు. వారిలో 2990 మంది పిల్లలకు మాత్రలను వేశారు. కార్యక్రమంలో డాక్టర్ సుచరిత, పీహెచ్ఎన్ లక్ష్మీనరసమ్మ, హెచ్ఎస్ నరసింహారావు, రమాదేవి, అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

● బొల్లాపల్లి: మండలంలో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా 4,919 మంది పిల్లలకు గాను 4,536 మంది పిల్లలకు మాత్రలను వేసినట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ కృష్ణా నాయక్ తెలిపారు. మిగిలిన పిల్లలకు ఈ నెల 20వ తేదీన టాబ్లెట్లను వేయటం జరుగుతుందని తెలిపారు. వెల్లటూరులో జరిగిన డీవార్మింగ్ డే కార్యక్రమంలో జిల్లా టీడీపీ అధికారి మురళీకృష్ణ పాల్గొన్నారు.



గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో రవి తదితరులు

మాదకద్రవ్యాల నివారణపై అవగాహన

నరసరావుపేట లీగల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ ఆదేశాల మేరకు పల్నాడు జిల్లాలో ఈ నెల 12వ తేదీ నుంచి జాతీయ యూత్ డే సందర్భంగా అక్టోబరు 11వ తేదీ వరకు వారానికి ఒక థీమ్ చొప్పున 8 వారాలు ఎనిమిది థీమ్స్‌తో హెచ్ఐవీ, ఎయిడ్స్, సుఖ వ్యాధులు, మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ బి. రవి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని హెచ్ఐవీ నియంత్రణ కోసం హైరిస్క్ గ్రూప్ కోసం పనిచేస్తున్న ఎన్జీవోలు వర్కర్ స్కీం వారు జిల్లాలోని పాఠశాలలు, కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు, పట్టణాలు గ్రామాలలోని ప్రజలకు మీటింగులు, కళాజాత, కార్యక్రమాలు డోర్ టు డోర్ క్యాంపెయిన్ తదితర పద్ధతుల్లో అవగాహన కల్పిస్తామని తెలిపారు. హెచ్ఐవీ నిర్ధారణ పరీక్షలు సమీప ప్రభుత్వ ఆసుపత్రిలోని ఐసీటీసీ కేంద్రాలలో ఉచితంగా చేయించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రసూన డాక్టర్ మురళీకృష్ణ, జానీ భాష స్వచ్ఛందసేవా సంస్థ ప్రతినిధులు సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా వ్యవహరించాలి

● మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి


నరసరావుపేట రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా వ్యవహరించాలని పల్నాడు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం జరిగిన పత్రికా విలేకరుల సమావేశంలో డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొని మాట్లాడుతూ మంగళవారం జరిగిన పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ రెండు ఖూనీ చేశాయని ఆరోపించారు. ఎన్నికల కమిషన్ నిజాయితీగా, నిష్పాక్షికంగా పనిచేయాలని ఎన్నికలలో అక్రమాలు అరాచకాలకు పాల్పడుతున్న ఈ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పే రోజు తొందరలోనే వస్తుందన్నారు.

మురికిపూడి జడ్పీ హైస్కూలులో ఉపకారవేతనాల పంపిణీ

చిలకలూరిపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట, వివేకానంద సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం చిలకలూరిపేట మండలం మురికిపూడి జడ్పీ హైస్కూలులో చదువులో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ ఏడాది టెన్త్ పరీక్షలలో మొదటి మూడు స్థానాలు పొందిన వారికి కాపు వెంకటరావు రూ.5,000, రూ.3,000, రూ.2,000 అందచేశారు. కారుమంచి శివరావు నాలుగో స్థానం వచ్చిన వారికి రూ.2,000, ఎండీ యూసఫ్ ఆలీ ఐదో స్థానం వచ్చినవారికి రూ.2,000 అందచేశారు. కాగా బీటెక్ చదువుతున్న మరియదాసు అనే స్కూల్ పూర్వ విద్యార్థికి కారుమంచి శివరావు రూ.5,000లు అందచేశారు. కార్యక్రమంలో స్వామి వివేకానంద సేవా సమితి కార్యదర్శి వలివేటి వెంకట సత్యనారాయణ, రోటరీ క్లబ్ ఆఫ్ అధ్యక్షుడు ఉప్పుటూరి ప్రసాద్, హెచ్ఎం దేవరకొండ ధనలక్ష్మి పాల్గొన్నారు.

సరికొండపాలెంలో మైనింగ్ అధికారుల పరిశీలన

'ఆంధ్రజ్యోతి'కి స్పందన



సరికొండపాలెంలో అక్రమ క్వారీయింగ్‌ను పరిశీలిస్తున్న మైనింగ్, రెవెన్యూ అధికారులు

బొల్లాపల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సరికొండపాలెం నుంచి వినుకొండకు అక్రమంగా మట్టి తవ్వి తరలిస్తుండటంపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనాలకు దాచేపల్లి మైనింగ్‌శాఖ అధికారులు స్పందించారు. మంగళవారం సరికొండపాలెంలో జరుగుతున్న అక్రమ క్వారీయింగ్‌ను పరిశీలించి నివేదికలను పైఅధికారులకు అందజేయటం జరుగుతుందన్నారు. మైనింగ్ అధికారి జే సుధీర్, టీ శివ లీల, వీఆర్‌వో రాంబాబు, సర్వేయర్ డానియేలు పరిశీలించారు.

రైతులు పంటల బీమా చేయించుకోవాలి: ఏవో

నాదెండ్ల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు తాము సాగుచేసిన పంటకు బీమా చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు రైతులకు సూచించారు. మండలంలోని కనపర్రులో మొక్కజొన్న పంటను మంగళవారం పరిశీలించారు. కార్యక్రమంలో ఏడీఏ కేవీ శ్రీనివాసరావు, ఏవో శ్రీలత, ఏఈవోలు శ్రీనివాసరావు, జానీబాషా, నాయకులు సింగయ్య, జయ ప్రసాదు, రాఘవయ్య పాల్గొన్నారు.



చిలకలూరిపేటలో జరిగిన హర్ ఘర్ తిరంగా ర్యాలీ, పాల్గొన్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

350 అడుగుల జాతీయ జెండాతో చిలకలూరిపేటలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ

చిలకలూరిపేట, ఆగస్టు12 (ఆంధ్రజ్యోతి): జాతీయ సమైక్యత దేశభక్తిని చాటేలా ప్రతి ఇంటిపై జాతీయ పతాకం ఎగురవేయాలని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మంగళవారం పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు జరుగుతున్న హర్ ఘర్ తిరంగా ర్యాలీ ప్రతి భారతీయుడు గర్వించే కార్యక్రమన్నారు. చిలకలూరిపేట పట్టణంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీని ఆయన ప్రారంభించారు. 350 అడుగుల భారీ జాతీయ జెండాతో సాగిన ర్యాలీలో యువతతో కలిసి ప్రత్తిపాటి ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, కమిషనర్ పి.శ్రీహరిబాబు, అర్బన్ సీఐ పి.రమేష్, టీడీపీ సీనియర్ నాయకులు నెల్లూరి సదాశివరావు, షేక్ కరీముల్లా, కె.రమణ, ఎం.శివ, పఠాన్ సమద్‌ఖాన్, మద్దుమాల రవి పాల్గొన్నారు.

● ఈపూరు: స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని బొగ్గరం హైస్కూల్లో మంగళవారం హర్‌ఘర్ తిరంగా యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు జాతీయ జెండాని చేత పట్టుకొని జాతీయ గీతాలు ఆలపిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామారావు, కట్ట సుబ్బారావు, అజయ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

రూ.14.80 లక్షల సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

నరసరావుపేట టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలో నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో మంగళవారం సీఎం సహాయ నిధి నుంచి రూ.14.80లక్షల విలువ చేసే చెక్కులను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు హాజరై 19 లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. వైద్యసాయం కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి చెక్కులను తమకు అందేలా కృషిచేసిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో ధర్నా

వినుకొండ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈ నెల 12, 13వ తేదీలలో రాష్ట్రంలోని అన్ని డిపోల ఎదుట ధర్నా కార్యక్రమం పిలుపు మేరకు వినుకొండ డిపో ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ ధర్నాకు డిపో కమిటీ చైర్మన్ ఆర్.శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి డిపో ప్రెసిడెంట్ బి.సౌభాగ్యరాజు మాట్లాడుతూ విజయవాడ గవర్నర్‌పేట డిపో స్థలాన్ని 99 ఏళ్ల పాటు "లులూ" సంస్థకు లీజుకు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. 15 వేల ఖాళీలను శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేయాలని, కొత్త బస్సులు కొనుగోలు చేయాలని, ఉద్యోగులకు రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి వి.ఎస్.పి నాయక్, ముప్పాళ్ళ శ్రీను, ఆదెయ్య, డీఎస్‌రావు, రామారావు, కిరణ్, కేఎస్ఎస్ రెడ్డి, ప్రసాద్, రమణయ్య, కె.హరిబాబు, జీఎస్‌రావు, డి.వెంకటేశ్వర్లు రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: ఎన్ఎంయూఏ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఆర్టీసీ సిబ్బంది ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రెండు రోజుల ఆందోళనలో భాగంగా మంగళవారం చిలకలూరిపేట డిపోలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఐఆర్‌ను ప్రకటించాలని, ఆర్టీసీ స్థలాల లీజులను నిలిపివేయాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏ బకాయిలను చెల్లించాలని, గ్యారేజ్‌లో నెలకొని ఉన్న అపరిష్కృత సమస్యలను, మహిళా కండక్టర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పాఠశాలకు కంప్యూటర్ ప్రింటర్ వితరణ



దాత నాగేంద్రుడిని సత్కరిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

వినుకొండ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్ఎస్‌పీ కాలనీలోని జడ్పీ హైస్కూల్‌కు అవసరమైన కంప్యూటర్ ప్రింటర్ కొనుగోలు నిమిత్తం రూ.15వేలు విశ్రాంత ఉపాధ్యాయుడు గాండ్ల మూల నాగేంద్రుడు వితరణగా ఇచ్చినట్లు పాఠశాల హెచ్ఎం సీహెచ్.వీరప్పయ్య తెలిపారు. ప్రతి నెల తనకు వస్తున్న పింఛను తన తల్లిదండ్రులు గాండ్ల మూల సుబ్బయ్య, చెంచమ్మ జ్ఞాపకార్థం సేవాకార్యక్రమాలు చేస్తున్నానని దాత నాగేంద్రుడు తెలిపారు. ఈ సందర్భంగా నాగేంద్రుడును పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రైమరీ స్కూల్ హెచ్ఎం ఎన్.పద్మజ, పాఠశాల పీడీ ఆర్.రాధాకృష్ణమూర్తి, గోవింద్ నాయక్, రామాంజనేయులు, ఎలీషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆయిల్ ఫాం సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం: ఉద్యాన అధికారి లక్ష్మి

నాదెండ్ల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఆయిల్ ఫాం సాగుకు రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహమందిస్తోందని ఉద్యాన అధికారి ఆర్.శ్రీలక్ష్మి అన్నారు. మండలంలోని నాదెండ్లలో ఆయిల్ ఫాం మెగా ప్లాంటేషన్ డ్రైవ్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయిల్ ఫాం మొక్కలను 100శాతం రాయితీతో 150మొక్కలను అందిస్తుందన్నారు. కార్యక్రమంలో నాదెండ్ల సొసైటీ అధ్యక్షులు ఎన్.హరిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు బి.సత్యనారాయణ, గోద్రేజ్ కంపెనీ ప్రతినిధి ప్రభాకర్ పాల్గొన్నారు.

యాంటీ డ్రగ్స్, యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఐ సమీర్ బాషా

వినుకొండ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు, వినుకొండ సీఐ శోభన్‌బాబు ఆధ్వర్యంలో పట్టణంలోని రాధా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు యాంటీ డ్రగ్స్, యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐలు సమీర్ బాషా, సత్యనారాయణలు పాల్గొని విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు. అలాగే ర్యాగింగ్ అనేది నేరమని, ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు తమ చదువుపై దృష్టి సారించి, సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాధా డిగ్రీ కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.